Sakshi                    Dt 10/12/12

జ్ఞాపకం

# తెలుగంటే మక్కువ...

**'ఓపెన్ మైండ్‌తో ఉండడం... ఓటమికి వెరవకపోవడం నేను నమ్మిన ఫిలాసఫీ. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు మొక్కవోని దీక్ష, సంకల్పంతో ముందుకు సాగాలి. దేన్నీ గుడ్డిగా నమ్మొద్దు. తార్కిక దృక్పథంతో ఆలోచించాలి. కొత్తవిషయాలను నేర్చుకోవడం అలవాటు చేసుకుంటే వరుస విజయాలు సాధించవచ్చు' అంటున్నారు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నల్లమిల్లి వెంకట సత్య నారాయణరెడ్డి (ఎన్వీఎస్‌రెడ్డి). ప్రతిష్టాత్మక మెట్రో రైలు ప్రాజెక్టు సారథిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన విజయప్రస్థానం ఎలా సాగింది..? ఆయనకు స్ఫూర్తి ప్రదాతలు ఎవరు..? మరిన్ని విషయాలు 'జ్ఞాపకం'లో...**

- సిటీబ్యూరో, న్యూస్‌లైన్



మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

**తూ**ర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు మా సొంతూరు. తండ్రి సత్యనారాయణరెడ్డి, తల్లి ఆదిలక్ష్మి. గ్రామ రాజకీయాల్లో మా నాన్న కుటుంబ ఆస్తులు చాలా పోగొట్టుకున్నారు. మా అమ్మ ఎక్కువ చదువుకోకపోయినా లోకజ్ఞానం ఎక్కువ. అన్ని విషయాలపై అవగాహన ఉండడంతో నాకు జీవితపాఠాలు నేర్పింది. మా తాత గారు పొలం పనులు చూసేవారు. ఆయన వ్యవసాయ పనులు నిర్వహించే తీరు చూసి నేను చిన్నప్పుడే మేనేజ్‌మెంట్ పాఠాలు నేర్చుకున్నా.

## డాక్టర్ కావాలనేవారు...

నేను డాక్టర్ కావాలనేది నా తల్లిదండ్రుల కోరిక. ప్రాథమిక విద్యాభ్యాసం సొంతూళ్లోనే. ఇంటర్ రామచంద్రాపురంలో...సైన్స్ గ్రూపు చదివాను. ఆ తరవాత సివిల్ సర్వీస్ లక్ష్యంగా బీఏ కోర్సులో చేరాను. అప్పుడు మా వాళ్లు, ఉపాధ్యాయులు నన్ను తిట్టారు. తరగతి ఫస్టు వచ్చే విద్యార్థి ఆర్ట్స్ గ్రూపుతీసుకోవడం ఏమిటని ఎగతాళి చేశారు. కానీ నేను ఎవరి మాట వినిపించుకోలేదు. డిగ్రీలో ఆంధ్రా యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాను.

ఆ తరవాత ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అప్పట్లో సివి ల్స్‌కు ఎంపికయ్యే వారిలో అత్యధికంగా ఆ వర్సిటీ నుంచే ఉండేవారు. సివిల్స్ తొలిప్రయత్నంలో విఫలమయ్యాను. రెండో ప్రయత్నంలో (1983లో) ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్ (ఐఆర్‌ఏఎస్)కు ఎంపికయ్యాను. పీజీలో మా పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ రషీదుద్దీన్ ఖాన్ నా సిద్ధాంత పత్రాలు(థీసిస్ పేపర్లు) చూసి.. హార్వర్డ్‌లో ప్రొఫెసర్ అయ్యే అర్హతలుండి సివిల్స్‌కు ప్రిపేరవ్వడం దండగ అనేవారు. కానీ నేను సివిల్స్ బాటనే ఎంచుకున్నా.

## కారల్ మార్క్స్ ప్రభావం...

కమ్యూనిస్టుల్లా కారల్ మార్క్స్ పుస్తకాలు అత్యధికంగా చదివాను. ఆయన రచనల ప్రభావం నాపై బాగా ఉండేది. ప్రపంచంలో ఎందరో తత్వవేత్తలున్నా.. సగం ప్రపంచాన్ని కమ్యూనిజం వైపు తిప్పుకోవడం ఆయనకే సొంతం. నేను చదివింది ఆర్ట్స్ అయినా ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్, సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్స్ ఇలా అన్ని విభాగాలపై మంచి అవగాహన పెంపొందించుకున్నాను. దేశంలో సంస్కరణలు మొదలైనప్పటి నుంచి నేను నా దృక్పథాన్ని మార్చుకున్నాను. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో అద్భుతాలు సృష్టించవచ్చని తెలుసుకున్నాను.

## ఆంగ్లం రాక ఇబ్బంది పడ్డా...

ఎనిమిదో తరగతిలో ఆంగ్లం రాకపోవడంతో నెహ్రూ రాసిన 'డిస్కవరి ఆఫ్ ఇండియా' పుస్తకాన్ని తెలుగులో చదివాను. ఇంటర్ వరకు ఆంగ్లంపై పట్టు సాధించలేక బాగా ఇబ్బంది పడ్డాను. డిగ్రీలో మా లెక్చరర్ వై.వెంకట్రామయ్య ఆంగ్లంలో ప్రావీణ్యాన్ని చేశారు. మరో లెక్చరర్ డాక్టర్ రుద్రయ్య చౌదరి గొప్ప మేథావి. వాళ్లను చూసి విశాల దృక్పథం అలవాటు చేసుకున్నాను.

## తెలుగుసాహిత్యంపై అమిత ప్రేమ...

విద్యార్థిగా ఉన్నపుడు తొలిసారిగా ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన 'మాలపిల్ల' నవల చదివాను. నవలలు, కవితలు విపరీతంగా చదివేవాన్ని. ఒక విధంగా చెప్పాలంటే పుస్తకాల పురుగునే. చలం, రంగనాయకమ్మ, బుచ్చిబాబు, తిలక్, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారె, దాశరథి, గజ్జెలమల్లారెడ్డి.. ఇలా అందరి రచనలు చదివాను. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) రచనలు అంటే ప్రత్యేక అభిమానం ఉండేది. విద్యార్థిగా ఉన్నపుడు కవితలు రాసేవాడిని.

## గార్డెనింగ్ ఇష్టం ...

కూరగాయలు, మొక్కల పెంపకంపై బాల్యం నుంచే ఆసక్తి. తీరిక దొరక్కపోవడంతో ప్రస్తుతం చేయడం లేదు. రిటైరయ్యాక దృష్టి పెడతా.

## జీవన నేపథ్యం...



భార్య ప్రతిమ, పిల్లలు రాహుల్, అర్జున్‌లతో ఎన్వీఎస్ రెడ్డి

**పేరు:** నల్లమిల్లి వెంకట సత్యనారాయణ రెడ్డి
**పుట్టినతేదీ:** 13 ఏప్రిల్ 1957
**స్వస్థలం:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు
**తల్లిదండ్రులు:** సత్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి
**భార్య:** ప్రతిమ, కస్తుర్బా గాంధీ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్
**పిల్లలు:** ఇద్దరబ్బాయిలు.
మొదటి అబ్బాయి అర్జున్. అమెరికాలో ఎంఎస్ చేసి మెకిన్సే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.
రెండో అబ్బాయి రాహుల్.
బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.
**అభిమాన నాయకుడు:** రాజీవ్‌గాంధీ
**ఇష్టమైన ప్రదేశం:** సింగపూర్
**హాబీలు:** పుస్తకపఠనం, వీలుదొరికితే ఐఐఎం, ఐఎస్‌బీలో పాఠాలు బోధన...

### తీపి జ్ఞాపకాలు...

కొంకణ్‌రైల్వే ప్రాజెక్టులో పనిచేసేందుకు మెట్రోమ్యాన్ శ్రీధరన్ నన్ను ప్రత్యేకంగా ఎంపికచేశారు. ఆయన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా ఆ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తిచేశాం. నగరంలో ఎంఎంటీఎస్ మొదటి దశను విజయవంతంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నించాను. మన రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు మొదలైనపుడు నార్తర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో చేరాను రూ.500 కోట్ల నష్టంతో ఉన్న సంస్థను ఏడాది తిరిగే లోగా లాభాల బాట పట్టించడం లాంటివి...

## చేదు జ్ఞాపకాలివే...

సత్యం కుంభకోణం వెలుగుచూసినపుడు మెట్రో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎక్కడ చూసినా వ్యతిరేకతే. మా టీం కూడా డీలాపడింది. నన్ను ఈ బాధ్యతలనుంచి తొలగించమని అప్పటి ప్రభుత్వంపై ఇంటా బయటా ఒత్తిడి అధికమైంది. కానీ నేను ఆత్మ విశ్వాసం కోల్పోలేదు. అదే సమయంలో నాకు వ్యక్తిగతంగా పలు బహుళజాతి సంస్థలు ఆఫర్లిచ్చాయి. ఏడాదికి కోటి రూపాయలకు పైగా జీతం ఇస్తామన్నారు. కానీ నేను అంగీకరించలేదు. ఎంతో శ్రమించి సాధించిన మెట్రో ప్రాజెక్టును మధ్యలో వదిలేయడం నాకిష్టంలేదు. పైగా నా జట్టుసభ్యులు నాపై నమ్మకంతోనే ఈ ప్రాజెక్టులో పనిచేసేందుకు ముందుకొచ్చారు. ఓటమి ఎదురైనపుడు కుంగిపోకుండా.. ధైర్యంగా నిలబడి పోరాటం చేస్తేనే విజయం దక్కుతుందనేది నా నమ్మకం. అదే నన్ను నిలబెట్టింది.

## నా తప్పు లేదని తేలింది

జీహెచ్‌ఎంసీలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నపుడు పంజగుట్ట ఫ్లైఓవర్ కూలిపోయిన ఘటనలోనూ నన్ను తొలగించమని ప్రభుత్వంపై కొందరు ఒత్తిడిచేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నిపుణులైన ఇంజినీర్ల బృందంతో వాస్తవాలను తనిఖీచేయించడంతో నా తప్పులేదని తేలింది. అప్పుడూ ఇప్పుడూ నేను ఓటమికి వెరవను. పొగడ్తలకు పొంగను.